సాక్షి
అన్నమయ్య జిల్లా

బుధవారం । 5 । మార్చి । 2025



దేవుడా.. ఏమిటయ్యా ఈ ఘోరం!
రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు ఒకరి తర్వాత ఒకరు మృతి చెందారు. వీరి ఇద్దరి కుమార్తెలు గుండెలవిసేలా రోదించారు.
-8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధ॥ (సా॥)	సహార్ గురు॥ (ఉ॥)
రాయచోటి	6.28	5.09
రాజంపేట	6.26	5.17
పీలేరు	6.28	5.09
మదనపల్లె	6.30	5.11

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.110	రూ.140
రెండోరకం	రూ.80	రూ.100

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 73 మెట్రిక్ టన్నులు



సిరులు కురిపిస్తున్న దోస

మార్చి ప్రారంభంలోనే ఎండలు మండి పోతున్నాయి. జనం చల్లని పానియాలు తాగేందుకు ఆసక్తి చూపుతున్నారు. అయినా ఎండ తీవ్రతకు దాహార్తి తీరడం లేదు. దీంతో వేసవి తాపం నుంచి ఉపశమనం కలిగించే పండ్ల వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలో వీటి ధరలు విపరీతంగా పెరిగాయి. ఈ పరిణామం రైతులకు లాభసాటిగా మారింది.

- గతేడాది కంటే తక్కువ సాగు
- దిగుబడి కొనుగోలుపై వ్యాపారుల ఆసక్తి
- తొలి కోతలోనే అధిక ధరలు
- లాభాల బాటలో రైతులు





రైల్వేకోడూరు మండలం బొజ్జావారిపల్లెలో సాగు చేసిన దోస పంట

రైల్వేకోడూరు అర్బన్: గత కొన్నేళ్లుగా దోస పంట రైతులకు నష్టాలు మిగిల్చింది. తెగుళ్ల బెడదతో దిగుబడి సరిగా రాకపోవడం.. నాణ్యత కూడా లేకపోవడంతో ధరలు పలకలేదు. దీంతో ఈ ఏడాది దోస పంట సాగు చేసేందుకు అధిక మంది రైతులు ఆసక్తి చూపలేదు. జిల్లా వ్యాప్తంగా తక్కువ విస్తీర్ణంలో సాగైంది. దీంతో దిగుబడి కూడా తక్కువగా వస్తోంది. డిమాండ్‌కు తగ్గట్టుగా సరఫరా లేదు. ఈ నేపథ్యంలో దోస కాయల రేటు విపరీతంగా పెరిగింది. ఈ ఏడాదంతా ఇవే ధరలు కొనసాగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

తెగుళ్లను అధిగమిస్తే.. లాభాలు

దోస పంటకు ఆశించే అన్ని రకాల తెగుళ్ల నుంచి కాపాడుకుంటే.. ఈ రెండు నెలల్లో వచ్చే దిగుబడికి అధిక ధరలు ఉండి సిరులు కురిపించే అవకాశం ఉంది. ప్రస్తుతం మొదటి కోతలో టన్ను రూ.22 వేల నుంచి 24 వేల వరకు ధర పలుకుతోంది. రైతులకు లాభాలు తెచ్చి పెడుతున్నాయి. జిల్లాలోని 6 నియోజకవర్గాల్లో గత 5 ఏళ్ల 3900 ఎకరాలకు పైగా సాగు చేశారు. ఈ ఏడాది 3500 ఎకరాలు సాగు చేసినట్లు తెలుస్తోంది. ఏటా సెప్టెంబర్ నుంచి మార్చి వరకు సాగు చేస్తుంటారు. మల్చింగ్ షీట్‌పై పండించే దోస పంటకు విత్తనాలకే అధిక పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. దుక్కుల నుంచి దిగుబడి చేతికి వచ్చే వరకు అన్నీ కలిపి ఎకరాకు రూ. 60 వేల వరకు పెట్టుబడి అవుతుంది. తెగుళ్లను అధిగమించి దిగుబడి వస్తే లక్ష రూపాయల వరకు ఆదాయం ఉంటుంది. అందువల్ల రైతులు దోస పంటపై ఆసక్తి చూపుతున్నారు. అయితే పెట్టుబడి అధికం అవుతుండటంతో కొంత మంది వెనకడుగు వేస్తున్నారు. పెట్టుబడికి అవసరమయ్యే అంత డబ్బున్న వారు ఈ పంటపై మక్కువ చూపుతున్నారు. రెండవ కోతలో టన్ను రూ.14 వేల నుంచి 23 వేల వరకు పలికే అవకాశం ఉంటుందని అంటున్నారు. పంటను కాపాడుకుంటే ఈ నెలతోపాటు ఏప్రిల్‌లో అధిక ధర పలికే అవకాశం ఉంటుంది. పంటకు రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.

జిల్లాలో మల్చింగ్ షీట్‌పై పండిస్తున్న పంట

నియోజకవర్గం	దోస (ఎకరాల్లో..)
రైల్వేకోడూరు	2210
రాయచోటి	480
రాజంపేట	179
మదనపల్లి	125
పీలేరు	230
తంబళ్లపల్లి	708

తక్కువ కాలంలోనే దిగుబడి

ఈ ఏడాది దిగుబడి చేతికి వచ్చిన ప్రారంభ దశలోనే దోస పంట అధిక ధర పలుకుతూ లాభాలు తెచ్చి పెడుతోంది. జిల్లా వ్యాప్తంగా అధికంగా రైల్వేకోడూరు నియోజకవర్గంలో పండిస్తున్నారు. రాయచోటి, పీలేరు, రాజంపేట, మదనపల్లి, తంబళ్లపల్లి నియోజకవర్గాల్లో కూడా కొంత మేర సాగు చేశారు. సాధారణంగా రైతులు దోస పంటను తక్కువ సమయంలో దిగుబడి చేతికొచ్చి.. లాభాలు చూడవచ్చన్న కొండంత ఆశతో పండిస్తుంటారు. దుక్కులు, బోదెలుకట్టడం, మల్చింగ్‌షీట్, డ్రిప్ ఎరువులు అన్నీ కలిపి ఎకరాకు రూ.60 వేలకు పైగా పెట్టుబడి అవుతుంది. అయినా కేవలం రెండు నెలల్లో దిగుబడి, లాభాలు వస్తాయనే ఉద్దేశంతో రైతులు దోస పంట పండిస్తారు.



లారీలో లోడింగ్ చేసిన కాయలు

ధరలు స్థిరంగా ఉంటే లాభాలు



దోస పంటను పండించడానికి పెట్టుబడి అధికంగా ఉంటుంది. నేను 4 ఎకరాల్లో దోస పంట సాగు చేశాను. టన్ను రూ.22 వేలతో వ్యాపారస్తులు కొని ఎగుమతి చేసుకొన్నారు. ఇదే విధంగా ఈ నెల అంతా ధరలు ఉంటే రైతులకు అధిక లాభాలు వస్తాయి.
– కందుల మల్లికార్జునరెడ్డి, రైతు, రాఘవరాజపురం, రైల్వేకోడూరు

గతేడాది అంతా నష్టాలే



గతేడాది దోస పంట తెగుళ్ల బారిన పడి భారీగా నష్టం వచ్చింది. ఈ ఏడాది కూడా సాగు చేశాను. ఈ ఏడాది విత్తనాలు, కవర్లు ఇలా అన్నీ ధరలు పెంచారు. కాబట్టి పెట్టుబడి కూడా అధికం అయ్యింది. దోస కాయల ధరలు ఇలాగే కొనసాగితే లాభాలు వస్తాయి.
–సుంకర మురళి, రైతు, సత్రం, రైల్వేకోడూరు

ధరలు అధికంగా ఉండే అవకాశం



గతేడాది నష్టాలు రావడంతో ఈ ఏడాది ఎక్కువ మంది రైతులు దోస పంట సాగుపై ఆసక్తి చూపలేదు. తెగుళ్లను అధిగమిస్తే నాణ్యతను బట్టి ఈ ఏడాది ధరలు బాగా పలికే అవకాశం ఉంది. రైతులు, వ్యాపా రుల లాభాలు గడించనున్నారు. -కంభం మల్లికార్జునరెడ్డి, వ్యాపారి, కేసీ అగ్రహారం

సస్యరక్షణ చర్యలు పాటించాలి



దోస పంటకు తెగుళ్లు అధికంగా వస్తాయి. రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలి. ఇష్టం వచ్చినట్లు మందులు పిచికారీ చేస్తే నష్టపోయే ప్రమాదం ఉంది. అధికారుల సూచనలు, సలహాలు పాటించాలి. -వెంకటభాస్కర్, ఉద్యానశాఖ అధికారి, రైల్వేకోడూరు

న్యూస్‌రీల్

వలస వెళ్లకుండా పనులు కల్పించండి



ఉపాధి పనులను పరిశీలిస్తున్న పీడీ వెంకటరత్నం

రామాపురం: గ్రామాల్లో వలసలు వెళ్లకుండా ఉపాధి పనులు కల్పించాలని అన్నమయ్య జిల్లా డ్వామా పీడీ వెంకటరత్నం పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని రాచపల్లె, నల్లగుట్టపల్లె పంచాయతీల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం కూలీలకు 150 రోజుల పని దినాలు కల్పిస్తోందన్నారు. కూలి గిట్టుబాటు అయ్యే విధంగా చూడాలని మండల అధికారులకు సూచించారు. అనంతరం రాచపల్లె గ్రామంలో పశువుల షెడ్లు, ఫారంపాండ్లు, నల్లగుట్టపల్లెలో పశువుల నీటి కుంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఓ పెంచయ్య, ఈసీ శివయ్య, టీఏ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

సారా రహిత గ్రామాలుగా మార్చాలి



గ్రామస్తులతో ప్రమాణం చేయిస్తున్న అధికారులు

తంబళ్లపల్లె: మండలంలోని గ్రామాలను సారా రహితంగా తీర్చిదిద్దాలని ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కోటకొండతండాలో ములకలచెరువు ఎక్సైజ్ సీఐ మాధవి ఆధ్వర్యంలో మంగళవారం నవోదయం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారా అమ్మకాలు చట్టరీత్యా నేరమన్నారు. సారా వల్ల కలిగే అనర్థాలు, యువత పెడదోవ పట్టే విధానాన్ని వివరించారు. నవశకానికి నాంది పలుకుదామని గ్రామస్తులతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ జోగేంద్ర, తహసీల్దార్ హరికుమార్, ఎంఈఓ త్యాగరాజు, సర్పంచు తులశమ్మ తదితరులు పాల్గొన్నారు.

కౌమార దశలో సాధికారతే లక్ష్యం



మహిళా సంరక్షణ కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా శిశుగృహ అధికారి సుప్రియ

నిమ్మనపల్లె: కౌమార దశలోని బాల, బాలికల్లో సాధికారతను సాధించడమే కిశోరి వికాసం కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని జిల్లా శిశుగృహ మేనేజర్ సుప్రియ అన్నారు. మంగళవారం ఎంపీడీవో పరమేశ్వర్‌రెడ్డితో కలిసి మహిళా సంరక్షణ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15–18 ఏళ్ల వయసులోని బాల బాలికలను రెండు గ్రూపులుగా విభజించి, బాలికల కోసం సఖి, బాలుర కోసం యువ గ్రూపులను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి గ్రూప్‌లోను కనీసం ఐదుగురు నుంచి 14 మంది సభ్యులను చేర్చాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శులు పాల్గొన్నారు.

మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి



సెమినార్‌లో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ వెంకటాద్రి

రాయచోటి అర్బన్: అన్ని రంగాల్లో మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని జిల్లా అడిషనల్ ఎస్పీ వెంకటాద్రి తెలిపారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక సాయి ఇంజినీరింగ్ కళాశాలలో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో మహిళా పోలీసులు, కళాశాల విద్యార్థినులతో సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. ఏదైనా సమస్య వస్తే పోలీసులను ఆశ్రయించాలన్నారు. పోలీసుల సహాయం కోసం డయల్ 100 లేదా 112కు ఫోన్ చేయాలన్నారు. మహిళా హెల్ప్‌లైన్ నంబర్ 181కి కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో రాయచోటి మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ రవిశంకర్ రెడ్డి, ఎస్ఐ బి.శ్రీనివాస్ నాయక్, కళాశాల ఏడీ సుధాకరరెడ్డి, కళాశాల ఉమెన్స్ సెల్ కోఆర్డినేటర్ విశాలాక్షి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు సునీత, అరుణతోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

రాయచోటిలో ఉద్రిక్తత



సంఘటన స్థలంలో మోహరించిన పోలీసులు

- పరిస్థితిని అదుపులోకి తెచ్చిన పోలీసులు
- భారీగా బందోబస్తు ఏర్పాటు

రాయచోటి: రాయచోటిలోని శ్రీ వీరభద్రస్వామి పారువేట ఊరేగింపులో ఉద్రిక్తత చోటుచేసుకుంది. జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితులను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. ఇరు వర్గాల నుంచి సామరస్య పరిస్థితులు నెలకొనక పోవడంతో ఒక దశలో పోలీసులు లాఠీ చార్జీ చేసి చెదరగొట్టారు. శ్రీ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం ఆలయం నుంచి స్వామి వారి ఊరేగింపు ఠాణా మీదుగా రవి థియేటర్ సమీపంలోని పారువేట ప్రాంతానికి చేరుకుంది. ఊరేగింపులో భాగంగా కంసల వీధి నుంచి ఠాణా సర్కిల్‌లోని పెద్ద మసీదు వద్దకు చేరుకోగానే.. మరో వర్గం రోడ్డుపైకి రావడంతో ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇరు వర్గాలలోని చిల్లర మూకల కారణంగా పరిస్థితులు అదుపులోకి రాకపోవడంతో.. రెండో మారు ఎస్పీ సమక్షంలోనే పోలీసులు లాఠీచార్జీ చేసి ఇరువర్గాలను చెదరగొట్టాల్సి వచ్చింది. పరిస్థితులను అదుపు చేసేందుకు పట్టణంలో పోలీసులు భారీగా మోహరించారు. అనంతరం పారువేట కార్యక్రమాన్ని ప్రశాంతంగా ముగించారు.

ఇరువర్గాలకు హెచ్చరిక: ఎస్పీ

శాంతి భద్రతలకు ఏ మాత్రం విఘాతం కలిగించినా, అసాంఘిక శక్తులు బయటికి వచ్చినా తాట తీసి, కేసులు పెట్టి అంతు చూస్తామని ఎస్పీ విద్యాసాగర్ నాయుడు హెచ్చరించారు. వర్గాలను ఎవరు రెచ్చగొట్టినా చర్యలు కఠినంగా ఉంటాయని ఆయన తీవ్రంగా స్పందించారు. అదే స్థాయిలో స్థానిక పోలీస్ అధికారులు కూడా అప్రమత్తం కాకపోతే శాఖ పరమైన చర్యలు తప్పవని పట్టణ పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

స్వర్ణ అన్నమయ్య జిల్లాగా తీర్చిదిద్దుదాం



తాగునీటిపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ శ్రీధర్

కలెక్టర్ ఛామకూరి శ్రీధర్

రాయచోటి: స్వర్ణ అన్నమయ్య జిల్లాగా తీర్చిదిద్దేందుకు బలమైన రంగాలైన వ్యవసాయం, పర్యాటకం, ఉద్యానవనం, మైనింగ్‌లపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అన్ని శాఖల జిల్లా అధికారులతో స్వర్ణాంధ్ర 2047లో భాగంగా అన్నమ్మయ జిల్లా జీడీపీని ఏ విధంగా అభివృద్ధి చేయాలి అనే అంశంపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జీడీపీలో అన్నమయ్య జిల్లా ర్యాంకు 23గా ఉందని, దీనిని అభివృద్ధి పరచాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.


ఆర్‌డబ్ల్యూఎస్ వన్‌యాప్‌తో తాగునీటి సరఫరా

ఆర్‌డబ్ల్యూఎస్ వన్ యాప్‌ను ఉపయోగించుకొని అవసరమైన ప్రదేశాలలో తాగునీటి సరఫరా, నీటి నాణ్యత, సకాలంలో నీటి లభ్యత వంటి అంశాలపై దృష్టి సారించాలని కలెక్టర్ శ్రీధర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో జిల్లాలోని అన్ని మండలాల ఎంపీడీఓలు, గ్రామీణ నీటి సరఫరా శాఖ సిబ్బంది, పంచాయతీరాజ్ శాఖ సిబ్బంది తదితరులతో వేసవి కాలంలో నీటి సరఫరాపై కలెక్టర్ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో దాదాపు 536 గ్రామాలలో నీటి సమస్య ఎదురయ్యే అవకాశం ఉందని, ఈ ప్రాంతాలలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారి ప్రసన్న కుమార్, జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

రాయచోటి జగదాంబ సెంటర్: మదనపల్లెలో ఈ నెల 8న నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ శ్రీధర్ తెలిపారు. కలెక్టరేట్‌లో ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో మదనపల్లెలోని శ్రీనివాస డిగ్రీ కళాశాలలో జరిగే మెగా ఉద్యోగమేళా కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెక్‌మహీంద్రా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఏజిల్‌ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్, అడక్కో ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, అధ్య హెచ్‌ఆర్ సొల్యూషన్స్, నియోలింక్, ముత్తూట్ ఫైనాన్స్, టాటా క్యాపిటల్, బిగ్ సీ, ఫోన్ పే, ఫ్లిప్‌కార్ట్, అపోలో ఫార్మసీ తదితర కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. మరిన్ని వివరాలకు 6301612761, 9553202509, 9741432931, 8897776368 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదువు..
విజయం సులువు



- త్వరలో పదో తరగతి పరీక్షలు
- సబ్జెక్టుల వారీగా అవగాహన అవసరం
- మెలకువలు పాటిస్తే.. అధిక మార్కులు

సంబేపల్లె: విద్యార్థి జీవితానికి పదో తరగతి కీలక మలుపు. ఉన్నత విద్యకు, ఆ తర్వాత బంగారు భవిష్యత్తుకు పునాది. ఇది దృఢంగా ఉండాలంటే పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరచాలి. ప్రణాళిక ప్రకారం చదువుతూ.. ఉపాధ్యాయులు చెప్పిన మెలకువలు పాటిస్తే.. ఇదేమంత కష్టం కాదంటున్నారు నిపుణులు. మార్చి 17 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులకు ముందస్తు ప్రిపరేషన్ కోసం సబ్జెక్టు నిపుణుల అభిప్రాయాలతో ప్రత్యేక కథనం.

సమయం లేదు మిత్రమా ..

పది పరీక్షలకు దాదాపు రెండు వారాల సమయం మాత్రమే వుంది. పరీక్షలు ఎలా రాయాలి. ఉత్తమ మార్కులు సాధించేందుకు ఎలాంటి ప్రణాళికలు వేసుకోవాలి, ఏ పాఠ్యాంశాలను రివిజన్ చేసుకోవాలి? వంటి అంశాలపై ఆయా సబ్జెక్టు టీచర్ల సలహాలు, సూచనలు తీసుకోవాలంటున్నారు నిపుణులు. ముఖ్యమైన అంశాలపై పట్టు బిగిస్తే ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించవచ్చునని చెబుతున్నారు. అలాగే 'తెలుగులో దోషాలుండొద్దు.. హిందీలో నిబంధ్‌పై పట్టుండాలి.. ఆంగ్లంలో ఎడిటింగ్ ముఖ్యం, జీవన చిత్రాలపై తర్ఫీదు అవసరం, తికమక పడొద్దు.. సూత్రాల లెక్క తప్పొద్దు.. చరిత్ర తెలుసుకోవాలి' అంటున్నారు.. ఆయా సబ్జెక్టు టీచర్లు.



సంబేపల్లె జెడ్పీ పాఠశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న హెచ్‌ఎం నరసింహారెడ్డి

జిల్లాలో పదో తరగతి విద్యార్థుల వివరాలు

- మొత్తం విద్యార్థులు: 24,310
- ప్రభుత్వ, జెడ్పీ హైస్కూల్ వారు: 12,559
- మున్సిపల్ హైస్కూళ్లు, రెసిడెన్సీ హైస్కూళ్లు: 2,126
- ఆదర్శ పాఠశాలలు: 1484
- కేజీబీవీ: 799
- ప్రైవేటు ఎయిడెడ్ అన్‌ఎయిడెడ్: 7413
- మదరసా: 20
- ఇతరులు, ఓరియంటల్, మినీగురుకులాలు: 909

అక్షర దోషాలు లేకుంటే మేలు



తెలుగులో దోషాలు లేకుండా సమాధానాలు రాస్తే 20 శాతం మార్కులు సులువుగా సాధించవచ్చు. పద్యభాగంలో కవి పరిచయం, గద్యంలో ప్రక్రియలు, లేఖ, కరపత్రం అంశాలు, చందస్సులో వృత్త పద్యాలపై పశ్నలు వస్తాయి. విశ్వామిత్రుడు, మారీచుడు, సుగ్రీవుడు, దశరథుడు వంటి అంశాలతోపాటు రామాయణం, ప్రాశస్త్యం, సీతారామకల్యాణం వంటి అంశాలపై పట్టు సాధిస్తే అధిక మార్కులు సొంతం చేసుకోవచ్చు.
–ఎ.సుశీల, తెలుగు ఉపాధ్యాయురాలు, ఆదర్శ పాఠశాల, సంబేపల్లె మండలం

హిందీలో సులభంగా మార్కులు



హిందీలో సులభంగా ఎక్కువ మార్కులు సాధించవచ్చు. సెక్షన్–1లో 12 ఐచ్ఛిక వ్యాకరణ సంబంధిత ప్రశ్నలు ఇస్తారు. సెక్షన్–3లో ఓ కవి పరిచయంపై ఐదు మార్కులు ఉంటాయి. పరిచయం పేరాను చదివి ఖాళీలు పూరించాలి.
–మోహినీసా నదామి, హిందీ టీచర్

సూత్రాలపై పట్టు సాధించాలి



ప్రతి పాఠంలోనూ సూత్రాలపై పట్టు సాధిస్తే పరీక్షల్లో వచ్చే ప్రశ్నలకు సులువుగా సమాధానాలు రాయవచ్చు. బహుపదులు, వృత్తాలు, ఉపరితల వైశాల్యాల్లో పటాలు గీయడంపై సాధన చేయాలి. త్రికోణమితీయ, సర్వసమీకరణల ఉపరితల వైశాల్యాల పట్టికలపై సాధన అవసరం.
– ఇ.రెడ్డప్పరెడ్డి, గణిత ఉపాధ్యాయుడు

ఇలా రాస్తే మంచిది



ప్రశ్నలను ఒకటికి రెండు సార్లు చదివి అర్థం చేసుకున్నాకే రాయాలి. సమాధాన పత్రంలో పేజీకి 15 నుంచి 16 లైన్లు వుండాలి. మొదటి వరుసలో ఎంత బాగా రాశారో, చివరి వరకు అదే గుండ్రని అక్షరాలతో కొనసాగించాలి.
–శశికళ, ఉపాధ్యాయిని

అర్థవంతంగా చదవాలి



జీవశాస్త్రంలో ప్రయోగాలు, పట్టికలు, పటాలపై పట్టు సాధిస్తే గరిష్ట మార్కులు సాధించవచ్చు. పాఠ్యపుస్తకాన్ని అర్థవంతంగా చదువుతూ.. ఏమవుతుంది, ఊహించి రాయండి, సూచనలు ఇవ్వండి, నినాదాలు రాయండి, ప్రశ్నించండి వంటి ప్రశ్నలకు సన్నద్ధం కావాలి. కిరణజన్య సంయోగక్రియలోని ప్రయోగాలు, ప్రత్యుత్పత్తి పాఠశాలలోని బొమ్మలపై పూర్తి శ్రద్ధ పెట్టాలి.
– ఓబుల్‌రెడ్డి, జీవశాస్త్ర ఉపాధ్యాయుడు

నిరంతర సాధన



రెయిమ్స్, స్కిమ్, ఫొనెటిక్స్‌ను చదివితే సులువుగా ప్రశ్నలకు జవాబులు రాయవచ్చు. ఎడిటింగ్, ప్యాసేజ్ అంశాలపై పట్టు సాధించాలి. యాక్టీవ్ వాయిస్, ప్యాసీవ్ వాయిస్, రిపోర్టెట్ స్పీచ్ అంశాలపై చదవాలి. ప్యాసేజ్ అంశాలపై పట్టు సాధించాలి. ఒకాబులరీ గ్రామర్‌కు టెక్స్‌టూల్‌ను నిరంతర సాధన చేయాలి.
– దేవప్రసాద్‌రెడ్డి, ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు

హెడ్డింగ్‌లు, సబ్‌హెడ్డింగ్‌లు పెట్టాలి



సాంఘిక శాస్త్రంలో అత్యధిక మార్కులు సాధించడానికి పట నైపుణ్యాలపై పట్టు సాధించాలి. ప్రపంచ పటాన్ని ఖండాల వారీగా సాధన చేయాలి. 8 మార్కుల ప్రశ్నలకు జవాబులను విస్తృతంగా రాయాల్సి ఉంటుంది. వీటికి హెడ్డింగ్‌లు, సబ్‌హెడ్డింగ్‌లు పెట్టడం ద్వారా ఉత్తమ మార్కులు సాధించవచ్చు.
– ఎం.నరసింహారెడ్డి, ప్రభుత్వ పాఠ్యపుస్తక రచయిత, ప్రధానోపాధ్యాయుడు, సంబేపల్లె జెడ్పీ పాఠశాల

క్లుప్తంగా

బోరు విషయమై వ్యక్తిపై దాడి

మదనపల్లె : బోరు విషయమై చెలరేగిన వివాదం కారణంగా ఓ వ్యక్తిపై దాడి చేసిన సంఘటన మంగళవారం మదనపల్లె మండలంలో జరిగింది. కొత్తవారిపల్లి పంచాయతీ గాజులవారిపల్లెకు చెందిన చంద్రయ్య(56), అతని తమ్ముడు చిన్న రెడ్డప్పలకు ఉమ్మడిగా బోరుబావి ఉంది. ఇటీవల బోరు చెడిపోవడంతో చిన్న రెడ్డప్ప కొంత నగదు వెచ్చించి మరమ్మతు చేయించాడు. చంద్రయ్య వాటాకు సంబంధించిన నగదు చెల్లించకపోవడంతో, ఈ విషయమై చిన్న రెడ్డప్ప చంద్రయ్యను నిలదీశాడు. ఇరువురి మధ్య వాగ్వాదం జరుగుతుండగా, చిన్న రెడ్డప్ప కుమారుడు గంగాధర్ అక్కడికి చేరుకుని ఇద్దరు కలిసి చంద్రయ్యపై కర్రలతో దాడి చేశారు. దాడిలో చంద్రయ్య తీవ్రంగా గాయపడగా, గమనించిన స్థానికులు మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గాలివీడు : పట్టణంలో భిక్షాటన చేసుకునే గుర్తు తెలియని వ్యక్తి కడప రిమ్స్‌లో మృతి చెందాడని ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. గత ముప్పై సంవత్సరాలుగా గాలివీడు పట్టణం గేటు పరిసర ప్రాంతాల్లో భిక్షాటన చేసుకుంటూ మతిస్థిమితం లేక వీధుల్లో తిరుగుతుండేవాడన్నారు. అనారోగ్యంతో రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే గాలివీడు ఎస్‌ఐ 9121100556 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

పంట పొలాలపై అడవి పందుల దాడి



అరటి చెట్లను ధ్వంసం చేసిన అడవి పందులు

పుల్లంపేట : మండలంలోని అనంతంపల్లి పంచాయతీకి చెందిన తిప్పన ప్రభాకర్ రెడ్డి అనే రైతు అరటి పంటను సోమవారం రాత్రి అడవి పందులు ధ్వంసం చేశాయి. పంట చేతికందే సమయంలో సుమారు 50 అరటి చెట్లను అడవి పందులు ధ్వంసం చేశాయని బాధిత రైతు వాపోయాడు. ఫారెస్టు అధికారులు స్పందించి అడవి పందులు పంట పొలాల్లోకి రాకుండా చూడాలని, అలాగే ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం మంజూరు చేయాలని రైతు ప్రభాకర్ రెడ్డి కోరుతున్నాడు.

మహిళ ఆత్మహత్యాయత్నం



లక్ష్మీదేవి

రామసముద్రం : కుటుంబ కలహాల కారణంగా భర్తతో గొడవ పడి వివాహిత విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మంగళవారం రామసముద్రంలో జరిగింది. ఎస్‌ఐ రవికుమార్ కథనం మేరకు.. రామసముద్రం గాజులనగర్‌కు చెందిన కళాకారుడు తిరుమలేష్ తన భార్య లక్ష్మీదేవి(32)తో ఆర్థిక లావాదేవీల విషయమై గొడవ పడి చేయి చేసుకున్నాడు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన ఆమె ఇంట్లో ఉన్న విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబీకులు వెంటనే బాధితురాలిని చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వైద్యుల సిఫార్సు మేరకు తిరుపతి రుయాకు తీసుకెళ్లారు.

మాసూమ్ రోజేదార్.!

ఉపవాసదీక్ష చేపడుతున్న చిన్నారులు





ఖురాన్ పఠిస్తున్న చిన్నారులు

మదనపల్లె సిటీ : రంజాన్ మాసం ముస్లింలకు పరమ పవిత్ర మాసం. ఇస్లాం కాలమానంలోని 9వ నెల రంజాన్. ఈ మాసంలో ముస్లింలు 30 రోజుల పాటు ఎంతో నిష్ఠతో ఉపవాసదీక్షలు చేపడతారు. ఇందులో భాగంగా వేకువ జామున 4 గంటల సమయంలో అల్పాహారాన్ని స్వీకరిస్తారు. దీనిని 'సహరీ' అంటారు. అప్పటి నుంచి సాయంత్రం 6.30 వరకు ఎలాంటి ఆహార పానీయాలు సేవించకుండా ఉపవాసదీక్షను చేపడతారు. సాయంత్రం 6.30 గంటలకు ఖర్జూరంతో ఉపవాసదీక్షలు విరమిస్తారు. దీనిని ఇఫ్తార్ అంటారు. పెద్దలపై మాత్రమే ఉపవాసదీక్షలు విధిగా ఉండాలన్న నిబంధన ఉంది. మదనపల్లె పట్టణంలో 5 సంవత్సరాల నుంచి 10 సంవత్సరాలలోపు చిన్నారులు కూడా ఉపవాసదీక్షను చేపడుతున్నారు. వారిని చూసిన ప్రతి ఒక్కరూ వారి దైవభక్తిని మెచ్చుకొని 'మాసూమ్ రోజేదార్'(ఉపవాసం ఉన్న అమాయక బాలలు) అని అంటున్నారు. ఇలాంటి పలువురు చిన్నారులు 'సాక్షి'కి కనిపించారు. వారిని పలకరిస్తే ఉపవాసదీక్షలను పాటించడం తమకెంతో సంతోషంగా ఉందని తెలిపారు.

రోజా ఉంటే పుణ్యమట



రంజాన్ నెలలో ఉపవాసం ఉంటే పుణ్యం అధికంగా వస్తుందని మా నాన్నమ్మ చెబుతుంది. ప్రతి సంవత్సరం రోజాలు ఉంటాను. నేను కూడా ఈసారి నెల ఉపవాసాలు ఉంటున్నా.

– మహమ్మద్ తాహీర్

నాకు ఎంతో ఇష్టం



రంజాన్ అంటే నాకు ఎంతో ఇష్టం. ఐదుపూటలా నమాజ్‌తో పాటు ఉపవాసాలు ఉంటాను. మంచి చెడు గురించి తెలుసుకుంటాను. ఆధ్యాత్మికంగా గడుపుతా.

– ఆలియా సుల్తానా

ఆకలి దప్పికలు గుర్తుకు రావు



రోజా ఉండటం గత ఏడాది నుంచి అలవాటు చేసుకున్నా. అల్లాపై భరోసాతో దీక్షలు చేస్తున్నప్పుడు ఆకలి, దప్పికలు గుర్తుకు రావు. ఎండలు అధికంగా ఉన్నప్పుడు కాస్త జాగ్రత్త పడితే చాలు. ఈ ఏడాది కూడా అన్ని రోజాలు ఉండాలనుకుంటున్నాను.

– షాకీర్

కుటుంబ సభ్యులతో కలిసి..



రంజాన్ నెల వచ్చిందంటే మా కుటుంబ సభ్యులందరూ ఉపవాసాలు ఉంటారు. వారితో పాటు నేను కూడా మూడేళ్ల నుంచి దీక్షలు పాటిస్తున్నా. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు ఏం తీసుకోను.

– సానియా ముస్కాన్

చంపుతామని బెదిరించడంతో...
గుండెపోటుతో వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి



మృతి చెందిన బయనబోయన పెంచలయ్య

సాక్షి టాస్క్‌ఫోర్స్ : పెనగలూరు మండలం, కొండూరు పంచాయతీ, తిరణంపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త బయనబోయిన పెంచలయ్య (65) ప్రాణ భయంతో గుండె ఆగి మంగళవారం మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలిలా.. తిరుణంపల్లి గ్రామ సర్వే నెంబరు 5లో 2.76 ఎకరాలు పెంచలయ్య పేరుతో రెండేళ్ల క్రితం ఆన్‌లైన్ అయింది. అనంతరం ఆ సర్వే నెంబర్‌ను తన భార్య పేరుతో రిజిస్టర్ చేయించాడు. తిరుణంపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు బయనబోయిన బుజ్జి అలియాస్ మణి, వెంకటేషులు ఈ భూమి తమదంటూ రెండేళ్ల నుంచి పెంచలయ్య కుటుంబ సభ్యులను వేధిస్తున్నారు. మంగళవారం మృతుడు తన భూమిలో ఎండిపోయిన వేప చెట్టును కొట్టేందుకు ఉదయం 7 గంటలకు కూలీలను తీసుకెళ్లాడు. చెట్టును కొడుతున్న సమయంలో మణి, మరికొంత మంది అక్కడికి వచ్చి ఈ చెట్టును ఎందుకు కొడుతున్నావంటూ తీవ్రంగా దుర్భాషలాడారు. భూమిని రిజిస్టర్ చేయించుకున్నావు. నిన్ను కచ్చితంగా చంపేస్తామంటూ బెదిరించారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన పెంచలయ్య అదే భయంతో ఇంటికి వెళ్లాడు. ఉదయం 9 గంటల సమయంలో గుండెనొప్పి రావడంతో వాహనంలో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా మృతి చెందాడు. చంపుతామని బెదిరించడంతోనే భయపడి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహాన్ని పెనగలూరు పోలీస్ స్టేషన్ వద్దకు తీసుకువచ్చారు. రాజంపేట రూరల్ సీఐ వెంకటరమణ, ఎస్‌ఐ రవిప్రకాష్ రెడ్డిలు మృతుని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని తెలిపారు. కాగా చివరి క్షణంలో మృతుని కుటుంబ సభ్యులు గుండెపోటుతో మృతి చెందాడని స్టేట్‌మెంట్ రాసి కేసు వద్దని వెళ్లినట్లు పోలీసులు తెలిపారు.

నేటి నుంచి లెంట్‌డేస్ ప్రారంభం

40 రోజులు ఉపవాసాలతో ప్రార్థనలు చేయనున్న క్రైస్తవులు



ప్రార్థనలకు సిద్ధమైన ప్రార్థనా మందిరం

రాజంపేట టౌన్ : క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో ఉపవాసాలతో నలభై రోజుల పాటు చేపట్టనున్న లెంట్‌డేస్ (శ్రమకాలపు దినాలు) బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. గుడ్‌ఫ్రైడేకి నలభై రోజుల ముందు వచ్చే భస్మ బుధవారంతో లెంట్‌డేస్ ప్రారంభమవుతాయి. ఈ ఏడాది ఏప్రిల్ 18వ తేదీ గుడ్‌ఫ్రైడే కావడంతో లెంట్‌డేస్ నిర్వహణకు ఆయా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనల కోసం ఏర్పాట్లు చేశారు. అనేక మంది ఈ నలభై రోజులు ఎక్కువగా చర్చిలో గడుపుతారు. చర్చిలకు వెళ్లలేని వారు ఇంటి వద్దనే ఉంటూ ప్రార్థనలు చేసుకుంటారు.

దేవుడా.. ఏమిటయ్యా ఈ ఘోరం.!





రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన శారద, మాధవరెడ్డి



శారద, మాధవరెడ్డి (ఫైల్)

- భార్యా భర్తలు ఒకరి తర్వాత ఒకరు మృతి
- అడవిపల్లెలో అంతులేని విషాదం

కురబలకోట : భార్యా భర్తలు ఒకరి తర్వాత ఒకరు కన్నుమూశారు. అంతేకాదు భార్య చనిపోయిన విషయం భర్తకు తెలీదు. భర్త విషయం భార్యకు తెలీదు. తల్లిదండ్రులు దూరమవడంతో వీరి ఇద్దరి కుమార్తెలను ఓదార్చడం ఎవరి తరం కాలేదు. మాటలకందని విషాదం అలుముకుంది. కన్నీరుకే కన్నీరు తెప్పించే విషాద సంఘటన ఇది. గ్రామస్తుల కథనం మేరకు.. మండలంలోని అడవిపల్లెకు చెందిన ఎ. మాధవరెడ్డి (50) బెంగళూరులో ప్రైవేటు ఉద్యోగం చేస్తూ అక్కడే నివాసం ఉంటున్నారు. భార్య శారద (39). వీరికి ఇద్దరు కుమార్తెలు. ఇటీవల శారద తండ్రి చంద్రశేఖర్‌రెడ్డి అస్వస్థతకు గురి కావడంతో అతన్ని చూసేందుకు బెంగళూరు నుంచి వచ్చారు. తిరుపతి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తండ్రిని పలకరించి శనివారం స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. కారులో వస్తుండగా వాల్మీకిపురం సమీపంలోని విఠలం వద్ద ప్రమాదవశాత్తు జరిగిన రోడ్డు ప్రమాదంలో వీరిద్దరూ గాయపడ్డారు. భార్య ఎ. శారద తీవ్రంగా గాయపడి శనివారం సాయంత్రం అక్కడికక్కడే మృతి చెందారు. భర్త ఎ. మాధవరెడ్డి గాయపడి బెంగళూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. ఇలా ఒకరి తర్వాత ఒకరు మృతి చెందడంతో వీరి స్వగ్రామమైన మండలంలోని అడవిపల్లె శోక సంద్రమైంది. రెండు రోజుల క్రితం భార్య శారదమ్మ అంత్యక్రియలు నిర్వహించారు. ఆ విషాదం నుండి తేరుకోకమునుపే మంగళవారం అదే ఊరిలో భర్త అంత్యక్రియలు జరిపారు. అమ్మా..నాన్న ఇక మాకెవరు దిక్కు అంటూ వీరి కుమార్తెలు రోదించడం చూపరులను కలచి వేసింది. వీరిని చూసిన బంధుమిత్రులు వేదన చెందారు. ఇంటికి దీపంగా కంటికి రూపంగా ఉండాల్సిన తల్లిదండ్రులు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో అడవిపల్లె తల్లడిల్లిపోయింది. వీరి కుమార్తెలను, రక్త సంబంధీకులను ఓదార్చడం ఎవరితరం కాలేదు. భార్య సమాధి పక్కనే భర్త అంత్యక్రియలు నిర్వహించారు.

ఒంటిమిట్ట ఆలయంలో పనులకు పురావస్తు శాఖ కొర్రీ

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట కోదండరామాలయంలో ధ్వజస్తంభం, బలిపీఠం, ఇత్తడి రేకు తొడుగు మార్పు పనులపై కేంద్ర పురావస్తుశాఖ అధికారులు నేటికీ అనుమతులు ఇవ్వలేదు. బుధవారం నుంచి మహా సంప్రోక్షణ ఉత్సవాలు జరగనుండగా పురావస్తు శాఖ జీర్ణోద్ధరణ పనులు పూర్తి చేసింది. అయితే ఒంటిమిట్ట రామాలయంలో ధ్వజస్తంభం, బలిపీఠం, స్వర్ణ రంగు పొయ్యి అంద వికారంగా దర్శనమిస్తున్నాయి. వాటిని స్వర్ణ రంగుతో తీర్చిదిద్దేందుకు పురావస్తు శాఖ అనుమతులు వస్తాయనుకున్న టీటీడీ అధికారులు ధ్వజ స్తంభం చుట్టూ ఇనుప పైపులతో సారవ కట్టించారు. కాగా కేంద్ర పురావస్తుశాఖ అధికారుల ఆదేశాల మేరకు మరమ్మతులను తాత్కాలికంగా నిలిపివేసినట్లు సంబంధిత టీటీడీ అధికారులు తెలిపారు.

గుర్రంకొండలో భారీగా గంజాయి స్వాధీనం

పోలీసుల అదుపులో ముఠా సభ్యులు



గుర్రంకొండలో పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకున్న దుకాణాల సముదాయం ఇదే

గుర్రంకొండ : మండల కేంద్రమైన గుర్రంకొండలో పోలీసులు భారీగా గంజాయిని స్వాధీనం చేసుకున్న సంఘటన సోమవారం రాత్రి జరిగింది. ఇప్పటికే గంజాయి ముఠా సభ్యుల్ని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. వివరాలు ఇలా ఉన్నాయి. గత కొంత కాలంగా గుర్రంకొండలో గంజాయి ముఠా సభ్యుల కార్యకలాపాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. యథేచ్ఛగా గంజాయి అమ్మకాలతో పాటు వినియోగించేవారు రోజురోజుకు ఎక్కువైపోతున్నారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు గంజాయికి ఎక్కువగా బానిసలు అవుతుండడం గమనార్హం. ఈ నేపథ్యంలో స్థానిక తెలుగు జెడ్పీ హైస్కూల్, తెలుగు ప్రభుత్వ జూనియర్ కళాశాల పక్కన, పోలీస్ స్టేషన్‌కు ఎదురుగా దుకాణాల సముదాయం గంజాయి కార్యకలాపాలకు కేంద్రంగా మారింది. పలువురు గంజాయి ముఠా సభ్యులు ఈ దుకాణాల్లో గంజాయిని స్టాకు ఉంచుకొని నిత్యం సేవిస్తూ మత్తుగా తూలి అక్కడే ఉన్న సమాధులపై పడిపోతున్నారు. దీంతో గంజాయి కార్యకలాపాల జోరుపై సమాచారం అందుకున్న స్పెషల్ బ్రాంచి పోలీసులు, వాల్మీకిపురం, గుర్రంకొండ పోలీసులు బృందంగా ఏర్పడి గత రాత్రి ముందుగా అందుకున్న సమాచారం ప్రకారం పోలీస్ స్టేషన్‌కు ఎదురుగా ఉన్న ఓ వెల్డింగ్ దుకాణంలో ముకుమ్మడి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సుమారు రెండు కిలోల గంజాయి పార్శిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. సదరు వెల్డింగ్ దుకాణం యజమానిని అప్పటికప్పుడు అదుపులోకి తీసుకొని పోలీసులు రహస్య ప్రదేశంలో విచారణ నిర్వహించినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. గతంలో రెండు మార్లు గంజాయి కేసుల్లో నిందితులుగా ఉన్న ముఠా సభ్యులే ఈ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలినట్లు సమాచారం. సదరు ముఠా సభ్యుడు ఒకడు వెల్డింగ్ దుకాణంలో స్టాకు ఉంచి ప్రతి రోజు కొద్దికొద్దిగా వినియోగదారులకు విక్రయిస్తున్నట్లు సమాచారం. ఇదే విషయాన్ని వెల్డింగ్ దుకాణం యజమాని పోలీసుల వద్ద అంగీకరించినట్లు తెలిసింది. ఇప్పటికే పట్టుబడిన ముఠాసభ్యులు ఇచ్చిన సమాచారం మేరకు ఇందులో ఎవరెవరు ఉన్నారనే విషయం పసిగట్టి పలువురు ముఠా సభ్యుల్ని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. పెద్ద ఎత్తున గంజాయి పట్టుబడిన విషయం పట్టణంలో సంచలనం రేకెత్తించింది. సాక్షాత్తు వందలాది మంది చదువుకునే విద్యాలయాలకు పక్కన, పోలీస్ స్టేషన్‌కు ఎదురుగా ఉన్న ఓ దుకాణంలోనే గంజాయి పట్టుబడిన విషయం మండలంలో చర్చనీయాంశంగా మారింది. ఈ విషయమై ఎస్‌ఐ మధురామచంద్రుడును వివరణ కోరగా గత సోమవారం రాత్రి పోలీసుల దాడుల్లో కొద్దిగా గంజాయి పట్టుబడిందన్నారు. ఇందులో ఉన్న ముఠాసభ్యుల్ని విచారిస్తున్నామని త్వరలోనే వీరందరిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

పైపులైన్ కోసం టీడీపీ వర్గీయుల ఘర్షణ

వీరబల్లి : మండలంలోని గుర్రప్పగారిపల్లి పంచాయతీలోని కొత్త వడ్డిపల్లిలో తెలుగుదేశం పార్టీ వర్గీయుల మధ్య పైపులైన్ కోసం మంగళవారం ఉదయం ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో జగన్‌మోహన్ రాజు వర్గీయులు సుగవాసి బాల సుబ్రమణ్యం వర్గీయులైన చంద్రశేఖర్‌పై దాడి చేశారు. ఈ దాడిలో చంద్రశేఖర్ తలకు బలమైన గాయం తగిలింది. వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం సాయంత్రం ఇరువర్గీయులైన చంద్రశేఖర్, చంద్రమోహన్‌లు పైపులైన్ గేట్ వాల్ గురించి వాదోపవాదాలు చేరుకున్నారు. అంతటితో ఆగకుండా మంగళవారం తెల్లవారుజామున జగన్ మోహన్ రాజు వర్గీయులైన వీరనాగయ్య, చంద్రమోహన్‌లు కలిసి బాలసుబ్రమణ్యం వర్గీయులైన చంద్రశేఖర్‌పై దాడి చేసి గాయపరిచారు. ఈ ఘర్షణలో చంద్రశేఖర్ తలకు బలమైన గాయం తగిలింది. బాధితుడు వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడిని పోలీసులు రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

స్టార్టర్ చోరీపై ఫిర్యాదు

నిమ్మనపల్లె : మండలంలోని అగ్రహారం గ్రామానికి చెందిన మునిరత్నం అలియాస్ రామారావుకు చెందిన బోరుబావి వద్ద సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రూ. 12 వేలు విలువచేసే స్టార్టర్ పెట్టెను చోరీ చేశారు. మంగళవారం ఉదయం బోరు వద్దకు వెళ్లిన రైతు చోరీ జరిగిన విషయాన్ని గుర్తించాడు. వెంటనే నిమ్మనపల్లె పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఇద్దరిపై 6ఏ కేసు నమోదు

సిద్దవటం : రేషన్ బియ్యం 750 కిలోలు ఉన్నట్లు గుర్తించి డీలర్ బి. సుబ్బరాయుడు, ఎండీయూ ఆపరేటర్ శంకర్‌లపై మంగళవారం 6ఏ కేసు నమోదు చేశామని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శివన్న తెలిపారు. మాధవరం-1 గ్రామంలో రేషన్ అక్రమంగా రవాణా జరుగుతున్నట్లు సమాచారం రావడంతో సోమవారం రాత్రి ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించామన్నారు. దాడుల్లో వీరి నివాసాల్లో 750 కిలోల రేషన్ బియ్యం పట్టుబడ్డాయన్నారు. ఈ దాడిలో సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ సౌజన్య, వీఆర్‌ఓ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదంలో రైతుపై దాడి



బాధిత రైతు

గాలివీడు : మండల పరిధిలోని గోరాన్ చెరువు గ్రామం బండివాండ్లపల్లె భూ వివాదంలో మంగళవారం రైతుపై దాడి ఘటన చోటు చేసుకుంది. బాధితుని కథనం మేరకు మిట్టపల్లి కాటం రెడ్డి, బొజ్జమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. కాగా, వీరికి 21 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. దాదాపు ముప్పై సంవత్సరాల క్రితం మొత్తం భూమిని అన్నదమ్ములు సమ భాగాలు చేసుకున్నారు. ఈ క్రమంలో మిట్టపల్లి విశ్వనాథ రెడ్డి సర్వే నంబర్ 2024లో తనకు కేటాయించిన భూమిలో దాదాపు ఎనిమిది సంవత్సరాల క్రితం మామిడి మొక్కలు పెంచుకున్నాడు. భూ భాగాల విషయమై తరచూ అన్నదమ్ములు ఘర్షణ పడేవారు. ఇదే విషయమై రెవెన్యూ, పోలీసు అధికారులకు పలుమార్లు విశ్వనాథరెడ్డి తెలియజేస్తూ, భూ భాగాల ఒప్పంద పత్రాలు ఉన్నప్పటికీ అన్నదమ్ములు దానిని తిరస్కరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. తనకు కేటాయించిన భాగంలో మామిడి మొక్కలు పెంచుకున్నానని, తిరిగి అందులో మరో మారు భాగాలు పంచాలంటున్నారని తెలిపాడు. ఈ విషయమై జిల్లా ఎస్పీని కలసి వినతిపత్రం ఇచ్చానన్నారు. అయితే మంగళవారం గుర్తుతెలియని వ్యక్తులు మామిడి తోటకు వెళ్లే దారిలో మాటువేసి తనపై ముసుగు వేసి దాడి చేశారని కన్నీటి పర్యంతమయ్యాడు. కుటుంబ సభ్యుల సహాయంతో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రిలో చేరానని తెలిపాడు. అధికారులు విచారణ జరిపి తనపై దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని తన భూమిని తనకు ఇప్పించాలని కోరాడు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి తీవ్ర గాయాలు



కారు ఢీకొని గాయపడిన నారాయణస్వామి

మదనపల్లె : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మండలంలోని చిప్పిలి గ్రామానికి చెందిన నారాయణస్వామి(55) ట్రాక్టర్ కూలీగా పనిచేస్తూ జీవిస్తున్నాడు. మంగళవారం స్థానికంగా కూలి పనులకు వెళ్లి మధ్యాహ్నం తిరిగి ఇంటికి వస్తూ రోడ్డు దాటుతుండగా, కడప నుంచి బెంగళూరుకు వెళ్తున్న కారు వేగంగా ఢీకొంది. ప్రమాదంలో నారాయణస్వామి తలకు గాయమై తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి వెళ్లాడు. గమనించిన స్థానికులు వెంటనే బాధితుడిని స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. మండలంలోని ఆరోగ్యవరానికి చెందిన ధనమ్మ(72), స్థానికంగా రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనం వచ్చి ఢీకొంది. ప్రమాదంలో బాధితురాలు తీవ్రంగా గాయపడగా స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అదే విధంగా బాలాజీ నగర్‌కు చెందిన రఘునాథరెడ్డి (45), కుమారపురానికి చెందిన వెంకటస్వామి (46), ద్విచక్ర వాహనంలో వచ్చి సీటీఎం రోడ్డులోని పద్మావతి కళ్యాణ మండపం వద్ద రోడ్డు పక్కన నిలిచి ఉండగా, ద్విచక్ర వాహనం ఢీకొంది. వేగంగా వచ్చిన ద్విచక్ర వాహనదారుడు ఆటోను ఢీకొని ఆ పైన రఘునాథ్ రెడ్డి, కుమారస్వామి ఉన్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నాడు. ప్రమాదంలో ఇద్దరు గాయపడగా గమనించిన స్థానికులు బాధితులను ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.

నేను ఎప్పటికీ ఆకేపాటి వెంటే



గోపాల్‌రెడ్డి

రాజంపేట టౌన్ : తాను, తన కుటుంబం ఎప్పటికి వైఎస్సార్‌సీపీలో కొనసాగుతూ ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్ రెడ్డి వెంటే ఉంటామని హెచ్.కొత్తపల్లె మాజీ సర్పంచ్ చొప్పా గోపాల్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఆకేపాటి భవన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కొందరు తెలుగుదేశం పార్టీ నాయకులు ఆకేపాటికి వ్యతిరేకంగా మాట్లాడుతూ నిర్వహించిన సమావేశంలో తాను ఉన్న ఫొటో పత్రికల్లో వచ్చిందన్నారు. వాస్తవానికి తాను తనకు తెలిసిన ఓ వ్యక్తి మాట్లాడేందుకు ఫోన్ చేయగా అక్కడికి వెళ్లానని, అక్కడ జరిగిన సమావేశంతో తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. ఆకేపాటి అమరనాథ్‌రెడ్డితో తమకు నలభై ఏళ్ల అనుబంధం ఉందన్నారు. తాను ఎప్పటికీ వైఎస్సార్‌సీపీలోనే కొనసాగుతానని అలాగే అమరనాథ్‌రెడ్డికి మద్దతుగా ఉంటానని తెలిపారు.


అశ్వవాహనంపై భద్రకాళీ సమేత వీరభద్రుడు



అశ్వవాహనంపై ఊరేగుతున్న భద్రకాళీ సమేతుడు

రాయచోటి టౌన్ : రాయచోటి వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా భద్రకాళీ సమేత వీరభద్రస్వామి అశ్వవాహనంపై పుర వీధులలో ఊరేగారు. భక్తుల కోర్కెలు తీర్చుతూ పార్వేటకు వెళ్లారు. మంగళవారం ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు శంకరయ్య స్వామి, కృష్ణయ్య స్వామి, శేఖర్ స్వామి, మల్లికార్జున స్వామి, ఆలయ వేదపండితులు రాచరాయ యోగీ స్వామి ఆధ్వర్యంలో పార్వేటకు వెళ్లారు. ఈ వేడుకలో భాగంగా స్వామి వారిని, అమ్మవారిని రంగురంగుల పూలు, బంగారు ఆభరణాలు, పట్టువస్త్రాలతో అందంగా అలంకరించారు. ఈ ఊరేగింపులో భాగంగా స్వామివారికి అడుగడుగునా భక్తులు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. తుమ్మల హరినాథ ఆధ్వర్యంలో శిబ్యాల బలిజపల్లె కళాకారులతో కోలాటం, చెక్క భజనలు భక్తులను అలరించాయి. అలాగే ఉదయం సరస్వతీ దేవి పూజ నిర్వహించి చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు.

మహా సంప్రోక్షణకు ఒంటిమిట్ట రామాలయం సిద్ధం



మెటికలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

ఒంటిమిట్ట : ఆంధ్రా భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయంలో జీర్ణోద్ధరణ పనులు పూర్తయిన సందర్భంగా ఈనెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు జరగనున్న మహా సంప్రోక్షణకు టీటీడీ సర్వం సిద్ధం చేసింది. ఈ సందర్భంగా గర్భాలయ విమాన గోపురంపై స్వర్ణకలశం ఏర్పాటు చేసేందుకు చెక్కతో ప్రత్యేక మెటికలను ఏర్పాటు చేశారు. అలాగే భక్తులకు ప్రత్యేక క్యూలైన్లు, వేసవి ఎండ నుంచి ఉపశమనం కోసం జర్మన్ షెడ్లు, ఆలయ మాడవీధుల చుట్టూ చలువ పందిళ్లు, రామాలయం మొత్తం రంగురంగుల విద్యుత్ దీపాలతో సుందరమైన అలంకరణ ఏర్పాట్లు పూర్తి చేశారు. అలాగే మహా సంప్రోక్షణకు ఆలయ అర్చకుల సూచనల మేరకు టీటీడీ సివిల్ విభాగం అధికారులు యాగశాలలను తీర్చిదిద్దారు.